RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 120 | ఏప్రిల్ 3, 2025 | వెల : రూ.3-00

బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ

**కులగణన చేయలేదు..!**

ఢిల్లీ బీసీల పోరు గర్జనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

4లో..



# ప్రమాదకరంగా 'కాకతీయ' బ్రిడ్జిలు!

- కాలువలకు రక్షణ ఏర్పాట్లు కరువు
- ఇరుకు బ్రిడ్జిల మీదుగా నిత్యం వేలాది వెహికల్స్ రాకపోకలు
- ప్రమాదపు అంచున ప్రయాణం.. జాగ్రత్త వహించాల్సిందే..
- శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిల రిపేర్లు, కనీస రక్షణ చర్యలు పట్టించుకునే వారే లేరా?
- ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితేనే స్పందిస్తారా? వాహనదారులు, ప్రజల ఆందోళన

**వేద న్యూస్, ఫోకస్ టీమ్/ఎల్కతుర్తి :**

కరీంనగర్ నుంచి మొదలుకొని వరంగల్, వర్ధన్నపేట వరకు ఉన్న కాకతీయ కెనాల్ బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిలు అన్నీ దాదాపుగా ఇరుకుగా ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ప్రమాదపు అంచున ఉన్నాయని, కొన్ని శిథిలావస్థకు చేరాయని పేర్కొంటున్నారు. కనీసంగా సైడ్ వాల్స్ కూడా లేకపోవడంతో వాహనదారులు అటు వైపుగా ప్రయాణం చేయాలంటేనే జంకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం వేలాది వెహికల్స్ ఈ బ్రిడ్జిలు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా, ప్రమాదవశాత్తు సదరు బ్రిడ్జిలపై ఎలాంటి ప్రమాదాలు జరగకమునుపే కనీసంగా సైడ్ వాల్స్ నిర్మించడంతో పాటు రక్షణ చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

### నైట్ జర్నీ వెరీ డేంజరస్

వరంగల్ నుంచి కరీంనగర్ వరకు నిర్మించిన కాకతీయ కెనాల్ బ్రిడ్జిలు 60 ఏండ్ల క్రితం నిర్మించినవని తెలుస్తోంది. ఇవన్నీ కూడా దాదాపుగా శిథిలావస్థకు చేరాయని, ఈ బ్రిడ్జిల గుండా



వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారి నేషనల్ హైవే-563 ఉన్నది. అటు వరంగల్ నుంచి ఖమ్మం వరకు ఎన్‌హెచ్-563 కూడా

మిగతా 4వ పేజీలో..



# ఢిల్లీలో బీసీల పోరు గర్జన

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

బీసీల రిజర్వేషన్ల సాధన కోసం బుధవారం న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా జరిగింది.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడకు చెందిన బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలని,తెలంగాణ అసెంబ్లీలో స్థానిక సంస్థల్లో మరియు విద్యా,ఉద్యోగ రంగాల్లో 42 శాతం పెంచుతూ చట్టం చేశారని అన్నారు.ఈ 42 శాతాన్ని పార్లమెంట్ లో చట్టం చేసి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, గుండెబోయిన నాగేశ్వ రావు, ఎస్పీ నాయుడు, చేగోండి మురళి, నక్క నాగరాజు, యాదగిరి, శ్రీను, రాజేష్, హరితేజ, కృష్ణ, తాడూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బ్లెస్సికాకు మెడల్

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి నేమురి బ్లెస్సికాకి పి.యం శ్రీ పథకం గురించి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇబ్రహీంపట్నం వారు నిర్వహించిన ప్రతిభ పోటీలో డబ్బా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నేమురి బ్లెస్సికా 8వ తరగతి ప్రథమ బహుమతి మెడల్ మరియు నగదు బహుమతి ఐదు వందల రూపాయలు పొందినది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు అభినందనలు తెలియజేశారు, ఈ కార్యక్రమం లో డబ్బా ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తనుగుల రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లింగంపల్లి లక్ష్మి, ఉపాధ్యాయులు మండలోజు అశోక్, అల్లకట్టు సత్యనారాయణ, చిలుముల రాజేష్, బొల్లు శంకర్ వేముల నర్సయ్య డబ్బా అంగన్వాడీ టీచర్ గంగామణి, పద్మ, దేవయ్య విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటిన విలాయాత్ అలీ

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ప్రయత్నం అంటూ ఏదైనా చేస్తే సాధించలేనిది ఏది లేదని నిరూపించాడు ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన ఎండీ.విలాయాత్ అలీ. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటాడు. 489.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 86వ ర్యాంక్, జోనల్ స్థాయిలో బీసీ-ఈ కేటగిరిలో మొదటి ర్యాంక్ సాధించాడు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను సాఫ్ట్వేర్ ఉద్యోగం వదిలేసి సమాజ సేవ

మిగతా 4వ పేజీలో..

# నల్లమల అడవిలో ఒక్కరోజు

- విద్యుత్ ఉద్యోగుల సహకారంతో సేవా కార్యక్రమం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచు గిరిజన కుటుంబాలకు మద్దతుగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ముందుకొచ్చారు. విద్యుత్ బీసీ రాష్ట్ర నాయకులు మరియు సామాజికవేత్త మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ నుండి ప్రత్యేక సేవ బృందం ఏర్పడి,నల్లమల అడవుల్లో ఒక రోజు కార్యక్రమంలో భాగంగా కొల్లం చెంచుపెంటకు చేరుకుంది. అమరాబాద్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ఈప్రాంతంలో గిరిజన కుటుంబాలు మౌలిక వసతుల లేకుండా జీవనం సాగిస్తున్న సంగతి తెలుసుకుని, విద్యుత్ శాఖ రెవెన్యూ ఉద్యోగి కల్లెం శ్రీనివాస్ రెడ్డి తీసుకున్న ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.బాధ్యతగా ముందుకు వచ్చిన విద్యుత్ ఉద్యోగులు ప్రతి కుటుంబానికి దాదాపు రూ.5వేలు విలువైన వంటకు సంబంధించిన స్టీల్ సామాన్లు,బిందెలు,



బకెట్లు, గిన్నెలు, చేనేత దుస్తులు,దుప్పట్లు అందజేశారు. చెంచు గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తాం అని విద్యుత్ శాఖ సేవా బృందం పేర్కొంది. సుధాకర్ రెడ్డి, బంగారు రవికుమార్, మల్లోజు పాండురంగ, ఎక్కల శెట్టి కృష్ణ, కుక్కల సతీష్, రాజశేఖర్, కుసుమ విజయ, రాధిక,అరుణ్ కుమార్, గడేరాజు వెంకటేష్, సర్వేశ్వర్, అశోక్, భాస్కర్, అరుణ్ కుమార్, కుసుమ విజయ,గూడూరు శ్రీలత, రామకృష్ణ, గుడిసెల ప్రభాకర్, నాగరాజు, కోటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి ఇంటిని ముట్టడించిన కేయూ విద్యార్థి సంఘాలు**

4లో..




# పైన పటారం.. లోన లొటారం..!



- వరంగల్ ట్రాఫిక్ పోలీస్ వెహికల్ డొల్ల..
- భయం భయంగానే వాహనంలో అధికారి విధులు
- ఎప్పుడు ఏది ఊడిపోతుందో..? తెలియక ఆందోళన
- అద్దాలు లేవు.. ఇండికేటర్లు పనిచేయవు.. వెహికల్ కండిషన్ కథ చెప్పనక్కర్లేదు!
- మెయిన్ హెడ్ లైట్ వర్కింగేనా.. కనీస రిపేర్ గురించి పట్టించుకునే వారు లేరా?
- ప్రజల ప్రాణాలను రక్షించే ఖాకీలకు ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

వేద న్యూస్, ఫోకస్ టీమ్:

4లో..



# ఈ సారైనా... హైదరాబాద్ కు చోటిస్తారా...?

## ఆరు పోస్టులకు 12 మంది పోటీ

హైదరాబాద్ : రాష్ట్రంలో క్యాబినేట్ విస్తరణ కాకరేపుతున్నది. మంత్రివర్గ విస్తరణపై కసరత్తు పూర్తిచేసిన పార్టీ అధిష్ఠానం.. ఏ క్షణమైనా కొత్త అమాత్యుల జాబితాను విడుదలచేయబోతున్నట్లు అధి కార కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. దీంతో ఆశావాహుల్లో ఉత్కంఠ రేపుతున్నది. తమ సామాజికవర్గాలకు మంత్రి పదవి కావాలంటూ పలువురు ఎమ్మెల్యేల డిమాండ్లు తెరపైకి రావడం హస్తం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి టీమ్‌లో ఆరు బెర్తులే ఖాళీగా ఉన్నాయి.. ఆశావాహులు మాత్రం డజన్ మందికి పైగా ఉన్నా రు. క్యాబినెట్ కూర్పు విషయంలో ఇప్పటికే జిల్లా సమీకరణాలు, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకు ని ఓ అంచనాకు వచ్చినా, పార్టీ అధిష్ఠానానికి ఇప్పుడు పరిస్థితి జఠిలంగా మారిందనే టాక్ వినిపిస్తోంది. తెలంగాణలో 32 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్సీ సీట్లలో అన్యాయం జరిగిందని, మంత్రి వర్గ విస్తరణలోనైనా న్యాయం చేయాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య, తోట లక్ష్మికాంతరావు లేఖలు రాశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎస్సీలోని మాల సామాజికవర్గం నుంచి డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పార్టీ అవకాశం కల్పించిన విషయాన్ని మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలు గుర్తుచేస్తున్నారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాల సామాజికవర్గానికి కాకుండా మాదిగలకు ఇవ్వాలని కోరుతున్నారు. అందుకు ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను స్వయంగా కలిసి విన్నవించాలనే ఆలోచనతో ఉన్నారు. బీసీలకు రెండు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. మున్నూరు కాపు, గొల్ల, కుర్మ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు బెర్తు ఖాయమని ప్రచారం ఉన్న విషయం తెలిసిందే. అయితే ఒక్క శ్రీహరితోనే సరిపెడుతారా? లేక బీసీల్లో మరొకరికి అవకాశం కల్పిస్తారా? అనేది ప్రశ్నగా మారింది. ఇక ఎస్టీల్లోని లంబాడ సామాజికవర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతున్నారు. మంత్రివర్గంలో ఇప్పటికే ఆదివాసీ నుంచి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 నియోజకవర్గాలకు పైగా లంబాడీల ప్రభావం ఉంటుం దని, వారు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే అండగా నిలిచారని చెబుతున్నారు. ఇదే విషయంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు ఢిల్లీ పెద్దలను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. ఇక నల్లగొండ జిల్లా నుంచి రెడ్డి సామాజికవర్గం నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు మంత్రులుగా ఉండగా, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం రేసులో ఉన్నారు.

తనకు మంత్రిపదవి ఇస్తామని అధిష్ఠానం మాట ఇచ్చిందని, తనకు క్యాబినెట్‌లో చోటు దక్కుందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బలమైన నమ్మకంతో ఉన్నారు. ఉమ్మడి అదిలాబాద్ నుంచి ఓ వైపు వివేక్, మరోవైపు ప్రేమ్‌సాగర్‌రావు గట్టిగా ప్రయత్నాలు చేస్తుండటం పరిస్థితి మరింత సీరియస్‌గానే మారుతున్నది. వివేక్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లారని, ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయాన్ని పార్టీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా ఒకే కటుంబం వివేక్, వినోద్ ఎమ్మెల్యేలుగా ఉండగా, వివేక్ తనయుడు వంశీ పెద్దపల్లి ఎంపీగా ఉన్న విషయాన్ని పార్టీలోని పలువురు సీనియర్లు గుర్తుచేస్తున్నారు. అంతేకాకుండా మాల సామాజిక వర్గం నుంచి ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉండగా, అదే సామాజికవర్గానికి చెందిన వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైందనే వార్తలు వినిపిస్తుండగా, అదే జిల్లా నుంచి మరో ఎమ్మెల్యే మధన్‌మోహన్‌రావు కూడా అమాత్య పదవీ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి గతంలో కనీసం నలుగురు లేదా ఐదుగురు వరకు మంత్రులు ఉండేవారని, ఇప్పుడు ఒక్కరు కూడా లేరని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో మొత్తం జనాభాలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోనే 30 శాతం జనాభా ఉంటుందని, ఇక్కడి నుంచే రాష్ట్రానికి ఎక్కువగా ఆదాయం సమకూరుతుం దని, అలాంటి ఈ జిల్లాల నుంచి మంత్రివర్గ విస్తరణలో న్యాయం దక్కాలని కోరుతున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కూడా మంత్రిపదవీ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న తన పేరును పరిశీలించాలని కోరుతున్నారు.

# రామోజీ ఫిలింసిటీకి... హైడ్రా..

హైదరాబాద్ : రామోజీరావు హైదరాబాదులోని హయత్ నగర్ దాటిన తర్వాత అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో రామోజీ ఫిలిం సిటీని నిర్మించారు. ఫిలిం సిటీ అసలు విస్తీర్ణం ఇంతవరకు ఎవరికీ తెలియదంటే అది ఎంత పెద్దదో అర్థం చేసుకోవచ్చు. రామోజీ ఫిలిం సిటీ నిర్మాణం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరగగా.. వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మార్గదర్శి వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత రామోజీ ఫిలిం సిటీ కి సంబంధించిన అనేక విషయాలు బయటపడటంతో సంచలనంగా మారాయి. అప్పటిదాకా రామోజీ ఫిలిం సిటీ రామోజీరావు కష్టార్జితం అని అందరు అనుకున్నారు. కానీ ఎప్పుడైతే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటివారు తెరపైకి సంచలన ఆరోపణలు చేయడంతో రామోజీ ఫిలిం సిటీ కి సంబంధించిన అసలు విషయాలు వెలుగులోకి రావడం మొదలైంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామోజీ ఫిలిం సిటీ ని సర్వే చేయించాలని.. అందులో అసైన్డ్ భూములు ఉన్నాయని.. అవన్నీ పేదలకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇంతలోనే హెలికాప్టర్ ప్రమాదం చోటు చేసుకోవడంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కన్నుమూశారు. ఆ తర్వాత రామోజీ ఫిలిం సిటీ భూముల సంబంధించిన అసలు విషయం వెలుగులోకి రాలేదు. కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో రామోజీ ఫిలిం సిటీని 1000 నాగళ్ళతో దున్నుతానని అన్నారు. కానీ ముఖ్యమంత్రి అయిన తర్వాత రామోజీ ఫిలిం సిటీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. చివరికి రామోజీరావు కు సంబంధించిన మార్గదర్శి వ్యవహారంలోనూ ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయినప్పుడు.. కెసిఆర్ మాత్రం సైలెంట్ గా ఉన్నారు. ఇక ఆమధ్య ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన బిగ్ డిబేట్ లో పాల్గొన్న కేటీఆర్.. రామోజీరావు అరెస్టు సంబంధించిన అసలు విషయాన్ని చెప్పారు. రామోజీరావు వృద్ధుడు కాబట్టి.. ఆయన అనారోగ్యంతో ఉన్నారు కాబట్టి.. అరెస్టు చేయించలేదని వ్యాఖ్యానించారు. అంటే రామోజీరావు అక్రమాలు చేసినప్పటికీ కెసిఆర్ సైలెంట్ గా ఉన్నారని కేటీఆర్ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి లేకపోయినప్పటికీ రామోజీ ఫిలిం సిటీ వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. అలాగని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రామోజీ ఫిలిం సిటీపై చర్యలు తీసుకుంటుందని కాదు.. రామోజీ ఫిలిం సిటీ లో నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు కేటాయించిన భూములను యాజమాన్యం కబ్జా చేసిందని సిపిఎం ఆరోపించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన జాన్ వెస్లీ పేదలతో కలిసి ఫిలిం సిటీ ముట్టడి కార్యక్రమాన్ని




నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లిలోని రామోజీ ఫిలిం సిటీ వద్ద ఆర్ ఎఫ్ సీ ఇండ్ల పోరాట సమితి ఆధ్వర్యంలో ఫిలిం సిటీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. అయితే వారిని గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సిపిఎం నాయకులు, రామోజీ ఫిలిం సిటీ ఇండ్ల స్థలాల పోరాట సమితి నాయకులు పోలీసులను తోసుకుంటూ.. రామోజీ ఫిలిం సిటీ గేటు దూకి లోపలికి వెళ్లారు.. రోడ్డుమీద బైఠాయించి ఆందోళన చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమాని కంటే ముందు జాన్ వెస్లీ కీలక వ్యాఖ్యలు చేశారు. '' పేదలకు ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిని రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం దర్జాగా కబ్జా చేసింది. ప్రభుత్వ రోడ్డుకు అడ్డంగా గోడకట్టి గేటు ఏర్పాటు చేసింది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007 లో నాగన్ పల్లిలో సర్వే నెంబర్లు 203, 189 లో 20.4 ఎకరాలను 577 మంది పేదలకు ఇండ్ల స్థలాలుగా ఇచ్చారు. పట్టాలు కూడా అందజేశారు.. అయితే ఆ ఇళ్ల స్థలాల చుట్టూ రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ప్రహరీ నిర్మించింది. అక్కడికి వెళ్లే ప్రభుత్వ రోడ్డుకు గేటు కూడా ఏర్పాటుచేసింది. పేదల ఇళ్లస్థలాలు కబ్జాపై సిపిఎం నాయకులు ధర్నా చేయడంతో.. ఆ స్థలాలను పేదలకు అప్పగిస్తామని ఫిలిం సిటీ యాజమాన్యం నాడు చెప్పింది. ఒకవేళ ఇక్కడ కాకుండా మరొకచోట భూమి పరుగులు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం లే అవుట్ లాగా నిర్మించి అందిస్తామని లిఖితపూర్వకంగా కలెక్టర్ కు రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం హామీ ఇచ్చింది. 18 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఇంతవరకు పేదలకు న్యాయం జరగలేదు. వారికి న్యాయం జరిగేంతవరకు కదిలేది లేదని" జాన్ వెస్లీ స్పష్టం చేశారు. అయితే దీనిపై రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు. ఇక మిగతా మీడియా సంస్థల్లో దీనికి సంబంధించి వార్తలు కూడా పెద్దగా ప్రసారం కాలేదు.

# అలహాబాద్‌లో తెలంగాణ విద్యార్థి ఆత్మహత్య

నిజామాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల్లో రెండు విషాదాలు చోటుచేసుకున్నాయి. ఐఐఐటీ అలహాబాద్‌లో తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. హాస్టల్ బిల్డింగ్ 5వ అంతస్తు నుంచి కిందకి దూకి బలవన్మరణం చెందాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి మరుసటి రోజు పుట్టినరోజు జరుపుకోవాల్సి ఉండగా ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. చనిపోయే ముందు తల్లికి వీడియో కాల్ చేసి మాట్లాడినట్లు సమాచారం. అనంతరం కొంత సమయానికే రాత్రి అలహాబాద్ లోని ఐఐఐటీ హాస్టల్ బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ కు చెందిన విద్యార్థిని మాదాల రాహుల్ చైతన్యగా గుర్తించారు. ఆదివారం రోజు రాహుల్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు షాకయ్యారు. ధూమంగంజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అజేంద్ర యాదవ్ ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. విద్యార్థి బిల్డింగ్ మీద నుంచి దూకాడని సమాచారం అందిన వెంటనే పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. రాహుల్ ను ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే అతడు చనిపోయాడని నిర్ధారించినట్లు తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు రాహుల్ డిప్రెషన్ లోకి వెళ్లాడని పోలీసులు చెబుతున్నారు. ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. ప్రయాగ్‌రాజ్ డీసీపీ అభిషేక్ భారతి టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ, "పోలీసు టీమ్ కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తోంది. ఫోరెన్సిక్ నిపుణులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నాం" అన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కొంత సమయానికి ముందు రాహుల్ తల్లి స్వర్ణలతకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. తమ్ముడిని, నాన్నను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడని ఎన్డీటీవీకి తల్లి స్వర్ణలత తెలిపింది. అతడి నుంచి మెస్సేజ్ రావడం చూసి భయపడి అతనికి కాల్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి స్నేహితుడికి ఫోన్ చేయగా.. రాహుల్ గురించి తెలుసుకోవడానికి వెళ్ళాడు. రాహుల్ ఎక్కడ ఉన్నాడని మరొక విద్యార్థిని అడిగాడు వెంటనే కాల్ డిస్‌కనెక్ట్ చేశాడు. 10 నిమిషాల తర్వాత, నాకు తిరిగి ఫోన్ చేసి నా కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్తున్నానని చెప్పాడని ఆమె తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇన్‌స్టిట్యూట్‌కి చేరుకోగా, తన కొడుకు మరణ వార్త తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ ఆరు నెలలుగా క్లాసులకు హాజరుకావడం లేదని ఐఐఐటీ నుంచి మాకు సమాచారం రాలేదన్నారు. రాహుల్ గతేడాది ఏఐఇ మెయిన్స్ పరీక్షలో ఇబీూ విభాగంలో ఆలిండియా 52 ర్యాంక్‌ను సాధించాడు. చెవిటి, మూగ అయినప్పటికీ చదువులో చురుకుగా ఉండేవాడు. తరచుగా వీడియో కాల్స్ ద్వారా తన తల్లితో మాట్లాడేవాడని పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఓ విద్యార్థి బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా.. ఆదివారం మరో విద్యార్థి ప్రాణాలు విడిచాడు.

మరో బీటెక్ ఫస్టియర్ విద్యార్థి కార్డియాక్ అరెస్ట్ కావడంతో చనిపోయాడు. గంటల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు చనిపోవడంతో అలహాబాద్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో తీవ్ర విషాదం నెలకొంది. .

# మారనున్న బెల్లంపల్లి

అదిలాబాద్ : ఎట్టకేలకు బెల్లంపల్లి కార్మిక క్షేత్రానికి మహర్దశ ఆవరించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల మంజూరులో బెల్లంపల్లికి చోటు కల్పి ంచారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో సంతో షం వెల్లివెరుస్తోంది. పారిశ్రామిక ప్రాంతం గా పేరుగాంచి భూగర్భ గనుల వెనుకడుగుతో బెల్లంపల్లి ఉనికినీ కోల్పోతుంది. ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుతో బెల్లంపల్లికి పూర్వ వైభవం రానుంది. నూతనంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజక వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రూ. 200 కోట్లతో ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నతమైన ప్రమాణాలతో భవనాలు ఏర్పాటు చేయనున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యా బోధన లభిస్తుంది. భవిష్యత్తులో కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రాంతం పిల్లలకు అత్యున్నతమైన విద్య అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో ప్రత్యేక చొరవను కనపరిచినట్లు తెలుస్తుంది. సీఎం రేవం త్‌రెడ్డిని ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు విషయంలో తగిన శ్రద్ధ వహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. బెల్లంపల్లిలో పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉన్నత విద్యా అవ కాశాలకు ఏకైక మార్గంగా ఉంది. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు తమ పిల్లల ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు పంపిస్తున్నారు. లక్షల రూపాయలను కార్పొరేటు కళాశాలలకు ఫీజులు రూపంలో చెల్లిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఈ ప్రాంత విద్యార్థులు అందిపుచ్చుకోనున్నారు. ఇప్పటి వర కు బెల్లంపల్లి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఏ ఎమ్మెల్యే, ప్రభుత్వాన్ని ఒప్పిం చి ఉన్నత విద్య కళాశాలను సాధించిన ఘనత లేదు. బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సాధించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రికా ర్డును సొంతం చేసుకున్నారు. ఇదే కాకుండా బెల్లంపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల కూడా తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇంజనీరింగ్ కళాశాల ఒకటి అనే విషయం తెలిసిందే. ఇది ఇలా ఉంటే అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల స్కూల్‌ను సాధించడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుతో బెల్లంపల్లి జాతీయస్థాయిలో విద్య ప్రమాణాల సరసాన నిలువనుంది. ఏది ఏమైనా ఈ ప్రాంత ప్రజల ఊహకందని అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కల నెరవేరినట్టయింది. ఈ మేరకు అధికారగ ణం స్కూల్ నిర్మాణం కోసం 25 ఎకరాల స్థల సేకరణలో ఉన్నారు. స్థలం గుర్తింపు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారని సమాచారం. ఆమోదయోగ్యమైతే త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ స్కూల్ ఏర్పాటులో తొలి ఘట్టం సుఖాంతమైనట్టే.

# ప్రవీణ్ మృతిపై అనుమానాలు

కాకినాడ : పాస్టర్ ప్రవీణ్ పగడాల ఎలా చనిపోయారనే ఉత్కంఠ నడుస్తోంది. ప్రమాదమా? చంపేశారా? అనుకోకుండా జరిగిందా? పక్కా ప్లాన్డ్‌గా లేపేశారా? ఇది వాళ్ల పనేనా? ఇలా రకరకాల చర్చలు. ప్రవీణ్ ఒంటిపై గాయాలు ఎలా అయ్యాయి? దాడి చేసి కొట్టారా? కిందపడి గాయపడ్డాడా? బైక్ హెడ్‌లైట్ ఏమైంది? పక్కనుంచి వేగంగా వెళ్లిన ఆ రెడ్ కార్ ఎవరిది? ఇలా మీడియాలో గంటల తరబడి డిబేట్లు. వీ వాంట్ జస్టిస్ అంటూ క్రైస్తవ సంఘాల ఆందోళన. వేలాదిగా ఉన్న ప్రవీణ్ అనుచరుల్లో ఆగ్రహావేశాలు. సంయమనం పాటించాలని అన్నివర్గాల సూచనలు. ఇలాంటి ఉద్రిక్త వాతావరణంలో.. ప్రవీణ్ పగడాల మృతిపై ఏలూరు ఐజీ అశోక్ కుమార్ పెట్టిన ప్రెస్‌మీట్‌తో ఫుల్ క్లారిటీ వస్తుందని అంతా ఆతృతగా చూశారు. మీడియా సమావేశం అయితే పెట్టారు కానీ.. అందులో ఇచ్చిన స్పష్టత ఏమీ లేదు. ప్రవీణ్ ఎలా చనిపోయారో పోలీసులు చెప్పలేకపోయారు. పాస్టర్ మరణానికి కారణం ఏంటో పసిగట్టలేకపోయారు. పైగా విజయవాడలో ఆ 4 గంటలు ఏం చేశాడు? ఆయన ఒంటిపై గాయాలు ఎలా అయ్యాయి? బుల్లెట్ బండి ఎలా పడింది? అంటూ మరిన్ని డౌట్స్ క్రియేట్ చేసేలా చేసింది. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఇప్పటికీ అలానే కంటిన్యూ అవుతోంది.

డౌట్ నెంబర్ 1 : విజయవాడలో ప్రవీణ్ ఏం చేశారు?

మార్చి 24, ఉదయం 11 గంటలు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి బయలు దేరాడు ప్రవీణ్. మధ్యాహ్నం 1 గంటలకు చౌటుప్పల్ టోల్‌గేట్ దాటాడు. విజయవాడకు సాయంత్రం నాలుగున్నరకు చేరుకున్నాడు. సుమారు నైట్ తొమ్మిది వరకు ఆయన బెజవాడలోనే ఉన్నట్టు అనుమానం. మరి, ఆ 4 గంటలు ఆయన ఏం చేశారనేది పోలీసులకు సైతం అంతుచిక్కడం లేదు. విజయవాడలో ఎక్కడున్నారు? ఎవర్ని కలిశారు? ఏం చేశారు? అనేది సమాధానం లేని ప్రశ్న.

డౌట్ నెంబర్ 2 : ప్రవీణ్ బైక్ హెడ్‌లైట్ డ్యామేజ్‌కి రీజనేంటి?

ప్రవీణ్ బుల్లెట్ బండి లైట్ డ్యామేజ్‌పై మొదటినుంచీ అనుమానాలు ఉన్నాయి. 5 రోజుల విచారణ తర్వాత కూడా పోలీసుల సరైన కారణం చెప్పలేకపోయారు. సీసీకెమెరాల్లో ఆయన నడుపుతున్న బైక్‌కు హెడ్‌లైట్ వెలగలేదు. ఘటనకు ముందే లైట్ డ్యామేజ్ అయింది. స్పాట్‌లో పడి ఉన్న బండిని చూస్తే ఆ విషయం తెలిసిపోతోంది. మరి, ఆ లైట్ ఎక్కడ డ్యామేజ్ అయింది? ఎలా డ్యామేజ్ అయింది? స్పాట్‌కు ముందు మరో అవాంఛనీయ ఘటన ఏదైనా జరిగిందా? ఇలాంటి ప్రశ్నలకు పోలీసుల నుంచి జవాబు రాలేదు.

డౌట్ నెంబర్ 3 : ఆ రెడ్ కలర్ కారు సంగతేంటి?

సీసీకెమెరాలో కనిపించిన ఆ 4 వాహనదారులను విచారించామని.. వారికి ప్రవీణ్ ఘటనకు ఎలాంటి సంబంధంలేదని పోలీసులు తేల్చి చెప్పారు. అయితే, ప్రవీణ్ ఘటనతో సంబంధం లేకపోతే.. వాళ్లు అలా నిర్లక్ష్యంగా ఎందుకు వెళ్లిపోయారనే అనుమానం వ్యక్తం అవుతోంది. ప్రవీణ్ డెడ్‌బాడీపై బైక్ ఎలా పడిందని ప్రశ్నిస్తున్నారు. కారు ఢీ కొడితేనే బుల్లెట్ బండి కింద పడిందా? లేదా? అనేది ట్రాన్స్‌పోర్టు అధికారులు పరిశీలిస్తున్నారని ఐజీ చెప్పారు. ఈ విషయం చెప్పేందుకు 5 రోజుల సమయం సరిపోలేదా? అని ప్రవీణ్ అభిమానులు అడుగుతున్నారు.

డౌట్ నెంబర్ 4 : ప్రవీన్ ఒంటిపై గాయాలు..

పోస్ట్‌మార్టం రిపోర్ట్..

పాస్టర్ ప్రవీణ్ ముఖం, చేతులపై కొన్ని గాయాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. అయితే, ఆ గాయాలు ఎలా అయ్యాయి అనే విషయం మాత్రం చెప్పలేకపోతున్నారు. పోస్ట్‌మార్టం పూర్తి రిపోర్ట్ ఇంకా తమకు అందలేదని చెబుతున్నారు. ఇంతటి కీలకమైన కేసులో పూర్తి స్థాయి పోస్ట్‌మార్టం రిపోర్టు ఇచ్చేందుకు ఇంత సమయం ఎందుకు తీసుకుంటున్నారనే డౌట్ చాలామందిలో ఉంది.

# దువ్వాడపై చర్యలేవీ...

## - కేడర్ లో అసంతృప్తి జ్వాలలు



శ్రీకాకుళం : ఇటీవల కాలంలో వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం మరింత ముదిరిపోయింది. ఆమధ్య ఆయన ఏదో ఊరూపేరూ లేని యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. అది కూడా తన స్నేహితురాలు మాధురితో కలసి. ఆ తర్వాత ఉగాది పురస్కారాలు అంటూ దువ్వాడ–మాధురి స్టేజ్ మీదే దండలు మార్చుకున్నారు. తాజాగా విద్యుత్ శాఖ ఏఈపై దువ్వాడ బూతులతో విరుచుకుపడ్డారు. ఇవన్నీ చూస్తున్నా ఇంకా దువ్వాడ విషయంలో జగన్ నోరు మెదప లేదు, కనీసం పార్టీ క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోవడం లేదు. భార్యని వదిలిపెట్టి, ప్రియురాలితో పబ్లిక్ గా తిరుగుతున్న దువ్వాడ ఏపీ పెద్దల సభలో తమ పార్టీ సభ్యుడు అని చెప్పుకోడానికి కూడా వైసీపీకి పరువు తక్కువే. రాజకీయ నాయకులైనంత మాత్రాన కుటుంబ కలహాలు ఉండకూడదు అనుకోలేం. ఆ మాటకొస్తే వివాహాల విషయంలో కూడా ఎవరి వ్యక్తిగత నిర్ణయాన్ని ఇంకెవరూ తప్పుబట్టడానికి లేదు. అయితే దానికి కూడా ఓ పద్ధతుంటుంది. రెండో వివాహం చేసుకోవాలంటే మొదటి భార్యకు విడాకులు ఇవ్వాలనేది చట్టం. కానీ ఆచట్టాన్ని పక్కనపెట్టి, భార్యని వదిలిపెట్టి, ఎంచక్కా ప్రియురాలితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. ఈమధ్య వీరి జోరు బాగా ఎక్కువైంది. మీడియా వీరిద్దర్నీ హైలైట్ చేయడంతో దువ్వాడ ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. మాధురి జంటగా ఆయన కెమెరాలముందు ఇస్తున్న ఫోజులు వైరల్ గా మారుతున్నాయి. కూతురు వయసున్న మహిళతో దువ్వాడ సాన్నిహిత్యం ఎంతవరకు కరెక్ట్..? ఆ విషయం తెలిసినా కూడా ఆయన్ని వైసీపీ వెనకేసుకు రావడం ఇంకెంత వరకు కరెక్ట్. గతంలో పవన్ కల్యాణ్ వివాహాల గురించి తీవ్ర విమర్శలు చేసిన జగన్, దువ్వాడ కథపై మాత్రం నోరు మెదపడం లేదు. కనీసం ఆయనపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోకపోవడం విశేషం. దువ్వాడలో ప్రేమాయణం అనే యాంగిల్ మాత్రమే కాదు, బూతుల కోణం కూడా ఉంది. కరెంటు బిల్లు కట్టకుండా ఆపేసి, కనెక్షన్ తొలగించినందుకు ప్రభుత్వ అధికారిపై ఆయన దుర్భాషలాడిన ఆడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ ఆడియో బయటపడిన తర్వాత వైసీపీని జనం మరింతగా చీదరించుకుంటున్నారు. ఇలాంటి వారందర్నీ ఆ పార్టీలో జగన్ ఎందుకు ఇంకా ఎంటర్టైన్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మూడు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించని దువ్వాడ, కనెక్షన్ తీసేసినందుకు ఏఈపై బూతులతో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ మురళీమోహన్ కి ఫోన్ చేసి బూతులు తిట్టి బెదిరించారు. మురళీమోహన్ దళిత వర్గానికి చెందిన అధికారి కావడంతో ఆ సామాజిక వర్గం భగ్గుమంది. దళితులంటే అంత చులకనా అని వారు మండిపడ్డారు. కనీసం ఈ విషయంలో అయినా జగన్ స్పందించాలని, దళిత అధికారిని బూతులు తిట్టిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దువ్వాడ వ్యక్తిగత విషయాలను ఎవరూ పెద్దగా ప్రశ్నించకపోయినా, ఇప్పుడిలా అధికారులపై బూతుల దండకంతో విరుచుకుపడటం మాత్రం కచ్చితంగా ఖండించాల్సిన విషయమే. దువ్వాడ లాంటి నాయకుడు టీడీపీలో ఉంటే కచ్చితంగా వైసీపీ నుంచి కౌంటర్లు పడేవి, జగన్ కూడా ఏమాత్రం సందేహించకుండా విమర్శించేవారు. మరి అదే నాయకుడు వైసీపీలో ఉంటే మాత్రం ఆ పార్టీ నోరు మెదపడం లేదు.



## కన్నులపండుగగా సన్నబియ్యం పంపిణీ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**

సన్న బియ్యం పేదలకు వరమని, గత పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో ఏనాడు ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయలేదని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం నాడు సూర్యాపేట రూరల్ మండలం కెటి అన్నారం, కాసరాబాదు, కేసారం, ఇమాంపేట, దురాజ్ పల్లి, కుడకుడ లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలకు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో రేషన్ దుకాణాల వద్ద డప్పు లతో స్వాగతం పలికి, బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, కొప్పుల వేణారెడ్డి లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు సన్నబియ్యం ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. గత పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పుల పాలయిందని, ప్రతి నెల దాదాపుగా పదివేల కోట్ల రూపాయలు అప్పులకు వడ్డీ లు కట్టవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు ఇటువంటి సమయంలో కూడ సిఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉచితంగా ప్రతి ఒక్కరికి ఆరుకిలోల సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం పట్ల అభినందనలు తెలిపారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి అధికారంలో వున్నప్పుడు, లేనప్పుడు కూడ ప్రజా సేవలోనే వుంటారని, కాని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాత్రం నియోజకవర్గంలో కనపడరని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, చింత మల్ల రమేష్, వేములకొండ పద్మ సైదులు, రావుల రాంబాబు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



## సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయించండి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

వేములపల్లిమండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సర్వీస్ రోడ్డు వేయించాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి బుధవారం తాసిల్దార్ పుష్పలత కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో హైవే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు వేస్తామని చెప్పిన ఆనాటి కాంట్రాక్టర్ సర్వీస్ రోడ్డు నిర్మించకుండానే పెండింగ్లో పెట్టడం తో హైవే పై వెళ్తున్న బాటసారులతో పాటు ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే ఒక్క నెలలోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని మరి కొంతమంది రోడ్డు పాలు కాకుండా ఉండాలంటే తక్షణమే హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా బాధిత కుటుంబాలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



## పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం పంపిణీ

**వేద న్యూస్,దామరచర్ల/అడవిదేవులపల్లి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో మరియు అడవిదేవుల పల్లి మండల కేంద్రంలో ప్రారంభించి లబ్ధి దారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొనడం జరిగింది. నూతనగా ఎన్నికైనందున వారినీ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ నిరుపేదలకు ఆసరాగా ఉండేందుకు రేషన్లో ఇస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలు తినడానికి అనుగుణంగా లేకా బియ్యం తప్పు దారి పట్టించి కొందరు దందాలు చేసి డబ్బులు పోగు చేసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.రేషన్ కార్డు కలిగిన ప్రతీ ఒక్క నిరుపేద కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు, రేషన్ డీలర్స్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



సన్న బియ్యం పంపిణీ పథకం అమలు చేయడం చారిత్రాత్మకమని మెట్ పల్లి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణి కార్యక్రమాన్ని బుధవారం మెట్ పల్లి పట్టణంలోని 13వ వార్డు రేగుంటలో గల రేషన్ దుకాణంలో వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్, కొమ్ముల సంతోష్ రెడ్డి, ఖుతుబొద్దీన్ పాషా, ఉమేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ సీయూలో భూముల వేలం ప్రక్రియ విషయంలో

# కాంగ్రెస్ ప్రభుత్వంపై మావోయిస్టు పార్టీ ఆగ్రహం

**యూనివర్సిటీ భూములను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పథకాన్ని రూపొందించారు - మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో తాజాగా లేఖ విడుదల**

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు, హెచ్ సీయూలో భూముల వేలం ప్రక్రియ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మావోయిస్టు పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ భూములను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పథకాన్ని రూపొందించారని అందులో భాగంగానే యూనివర్సిటీలో ఘోరమైన నిరంకుశ పాలన కొనసాగుతున్నదని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో తాజాగా లేఖ విడుదల చేయడం కలకలం రేపుతోంది. నేటి పాలకుల విధానాల వలన మునుపెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఈ లేఖలో మావోయిస్టు పార్టీ ధ్వజమెత్తింది.రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధతను పట్టించుకోకుండా 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెడుతున్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతును నొక్కేస్తున్నారని మండిపడింది. నియంతృత్వ విధానాలను అమలు చేస్తూ కనీస పౌర స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయకూడదని ఈ నెల 13న ఓయూ రిజిస్ట్రార్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించిన వారినీ కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించిందని, యూనివర్సిటీల్లో విద్యార్థుల పోరాటాలను అణిచివేయడానికి ఈ నిషేధాజ్ఞలు విధించారని ఆరోపించింది.ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యల రాజ్యాంగ విరుద్ధం అని అప్రజాస్వామికం అని ధ్వజమెత్తింది. ఇలాంటి నిరంకుశత్వ చర్యలు దేశ భవిష్యత్తు ను నాశనం చేస్తాయని పేర్కొంది. విద్యను ప్రైవేట్ పరం చేసిన కార్పోరెట్లకు అప్పగించడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని పేర్కొంది. ఓయూ యునివర్సిటీ విద్యార్థులు నిజాం మొదలు నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నారని దేశ రాజకీయాల్లో తెలంగాణ సామాజిక, రాజకీయ ఆర్థిక పోరాటాలలో క్రియా శీలంగా పాల్గొన్నారు. విద్యార్థులు కేవలం సమస్యలకే పరిమితం కాలేదు ప్రజల



మౌలిక సమస్యల పరిష్కారానికి అనేక త్యాగాలు చేశారని లేఖలో ప్రస్తావించింది.నేడు చాలా మంది అనుభవిస్తున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక ఫలాలన్నీ విద్యార్థులు చేసిన వీరోచిత పోరాటాల ఫలితమేనని కానీ నేడు దోపిడీ పాలక వర్గాలు మాత్రం దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రయోజనాలను రక్షించడమే తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తింది. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వం విధించిన నిర్బంధ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆంక్షలను ఎత్తివేసే వరకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని ఈ లేఖలో మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

# నేను జోక్ చేయడం లేదు..

**- మూడోసారి అధ్యక్షుడయ్యేందుకు మార్గాలున్నాయ్ : డొనాల్డ్ ట్రంప్**

న్యూ డిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేసినా సంచలనమే అవుతుంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. తన పాలన ఎలా ఉంటుందో మరోసారి అందరికీ రుచిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు కావాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. తాను మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ విషయంలో తాను జోక్ చేయడం లేదని వ్యాఖ్యానించారు.ఇంటర్వ్యూలో భాగంగా మరోమారు అధ్యక్షుడు కావాలనుకుంటున్నారా..? అందుకు ఏమైనా వ్యూహాలున్నాయా..? అన్న ప్రశ్న ట్రంప్‌కు ఎదురైంది. ఇందుకు ఆయన సమాధానమిస్తూ.. 'రాజ్యాంగం అనుమతించకపోయినా.. మూడోసారి అధ్యక్షుడు కావడానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈ విషయంలో నేను జోక్ చేయడం లేదు. నన్ను మూడోసారి కూడా అధ్యక్షుడిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. అయితే, దాని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. ఆ విషయం మీకు కూడా తెలుసు' అని ట్రంప్ పేర్కొన్నారు.నిజానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తీ రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి వీల్లేదు. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడు కావాలంటే 22వ రాజ్యాంగ సవరణను మార్చాల్సి ఉంటుంది. దానికి అమెరికా కాంగ్రెస్‌తోపాటు రాష్ట్రాల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అది చాలా కష్టమైన పని. అమెరికా చరిత్రలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇటువంటిది జరగకుండా నివారించడానికి 1951లో 22వ రాజ్యాంగ సవరణ తెచ్చారు.అయితే, ట్రంప్ మాత్రం మూడోసారి, వీలైతే నాలుగోసారి కూడా అమెరికాను ఏలాలని కలలు కంటున్నారు. మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడంపై ఆయన ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ పాలక రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుడు యాండీ ఓగిల్స్ దిగువ సభలో ఇటీవలే సంయుక్త తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఆమోదం పొందితే డొనాల్డ్ ట్రంప్ మూడుసార్లు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడానికి వీలు కలుగుతుంది.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.యువ తేజం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న శనివారం ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ కంపెనీల ద్వారా నిరుద్యోగ యువతీ యువకుల మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. కనీసం పదవ తరగతి/ ఇంటర్/డిప్లమా/ఫార్మసీ/డిగ్రీ/ ఇంజనీరింగ్/పీజీ స్థాయి విద్యార్థులు వయస్సు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు లోపు వారు మీ యొక్క వివరాలను మీకు అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్లో వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.ఇట్టి జాబ్ మేళా లో వందకు పైగా కంపెనీలు, 2500 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు.జాబ్ లో సెలెక్ట్ అయిన వారందరికీ వారి అర్హతలను బట్టి కనీస జీతం 13000 రూపాయలు ఇవ్వబడునున్నారు. కావున ఈ యొక్క అద్భుత అవకాశం నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# మంత్రివర్గ విస్తరణ.. పలు శాఖల్లో మార్పులు

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. అయితే మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ అంతు పట్టడం లేదంటున్నారు. మంత్రిత్వ శాఖల భర్తీకి ఏఐసీసీ పచ్చజెండా ఊపినట్లు ప్రచారమైతే జరుగుతోంది. అయితే విస్తరణ ఎప్పుడు జరిగినా తమ శాఖలను మార్చాలని సిట్టింగ్ మంత్రులు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. మరోవైపు పనితీరు ఆధారంగా కొందరు మంత్రుల పోర్టుపోలియోలు మారుస్తారంటున్నారు. తెలంగాణ కేబినెట్‌లో భారీగా ప్రక్షాళనకు అడుగులు పడుతున్నాయంట.. 18 మంది సభ్యులు ఉండాల్సిన తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఆరు పదవుల కోసం చాలా మంది నేతలే రేసులో కనిపిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నాయి.గత కొంత కాలంగా కేబినెట్ విస్తరణ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం పలు దఫాలుగా చర్చలు జరుపుతూనే ఉంది. కొత్తగా వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ కూడా రాష్ట్రంలోని కీలక నేతలతో వ్యక్తిగతంగా భేటీ అవుతూ.. పరిస్థితులపై ఆరా తీస్తున్నారంట. దీంతో.. మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిందని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కేబినెట్ బెర్త్‌లు ఎవరెవరికి



కేటాయించాలన్న దానిపై హైకమాండ్ ఓ నిర్ణయానికి వచ్చిందంటున్నారు. ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడంతో పాటు ఇప్పుడున్న మంత్రుల శాఖలను కూడా మార్చే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు చెప్తున్నారు. పనితీరు ఆధారంగా కాంగ్రెస్ హైకమాండ్ మంత్రుల శాఖల మార్పులు చేర్పులు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తనకు ఇచ్చిన శాఖలపై సీనియర్ నాయకుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారన్న ప్రచారం చాలాకాలంగా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. ఉత్తమ్ దగ్గరున్న పౌరసరఫరాలు, ఇరిగేషన్ శాఖలు వేరొకరికి ఇచ్చి.. వేరే కీలక శాఖలను ఆయనకు ఇచ్చే దిశగా చర్చలు జరుగుతున్నాయంట.అటు మరో సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తన శాఖ పట్ల అసంతృప్తిగా ఉన్నారంట. కోమటిరెడ్డి తన సీనియార్టీతో పనులు పరుగులు పెట్టించాలని చూస్తున్నా ఆయన నిర్వహిస్తున్న ఆర్ అండ్ బి శాఖలో అధికారులు సహకరించడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారంట. అందుకే ఆయన కూడా తన శాఖను మార్చమని కోరుతున్నారన్న టాక్ వినిపిస్తుంది.మరోవైపు తెలంగాణలో ఎక్సైజ్ శాఖ పనితీరుపైనా ప్రభుత్వ, పార్టీ పెద్దలు అసంతృప్తితో ఉన్నారంటున్నారు.. ఆ శాఖను చూస్తున్న జూపల్లి కృష్ణారావు దగ్గరున్న ఎక్సైజ్ శాఖను మరొకరికి ఇచ్చే ఛాన్స్ ఉందంటున్నారు. అలాగే ఇప్పుడు మంత్రు ల దగ్గర అదనంగా ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నారంట. ప్రస్తుతానికి కేబినెట్‌లోకి నలుగురినే తీసుకోవచ్చంటున్నాయి ఏఐసీసీ వర్గాలు.ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరున్న హోంమంత్రి పదవి సుదర్శన్‌రెడ్డికి దక్కొచ్చంటూ ఢిల్లీ నుంచి లీక్‌లు వస్తున్నాయి. పార్టీలో సీనియర్ కావడం, వివాదరహితుడిగాఉన్న పేరు, గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడంతో హైకమాండ్ ఆయన వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మరి మంత్రి వర్గ విస్తరణపై ఎప్పుడు క్లారిటీ వస్తుందో?? శాఖల మార్పులు చేర్పులు ఎలా జరుగుతాయో కాని.. ఈ విస్తరణ తర్వాత కూడా రెండు కేబినెట్ పోస్టులను ఖాళీగా ఉంచే ఛాన్స్ ఉందంటున్నారు.

# మార్చిలోనే మండుతున్న ఎండలు

హైదరాబాద్ : మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. బయటకు వెళ్తే మాడు పగిలిపోతోంది. మరోవైపు వడగాలులు భయపెడుతున్నాయి. ఇప్పటికే ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక అలర్ట్ ఇచ్చింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుంది. వడగాల్పుల ప్రభావం కూడా ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో ఇవాళ 15 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, కొమరంభీం, మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఇప్పటికే తెలంగాణలో గరిష్టంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత దాటింది. మరింతగా ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. హైదరాబాద్‌లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాబోయే మూడు నెలల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశం ఉందని.. నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ, మధ్య తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అధిక వేడి ఉంటుందని చెబుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. 1901-2025 మధ్య సగటు ఉష్ణోగ్రతలు తీసుకుంటే.. ఈ ఏడాదే తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మార్చి 1 నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయని వాతావరణ శాఖ తెలిపింది. మార్చి నెలాఖరు నాటికి 42 నుంచి 43 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.వేసవిలో చెమట రూపంలో శరీరం నుంచి నీరు బయటకు వెళ్లిపోతుంది. కాబట్టి డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా తాగాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కాటన్ వంటి తేలికపాటి, వదులైన దుస్తులు ధరించడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఎండలో తిరగాల్సి వస్తే తప్పనిసరిగా సన్ స్క్రీన్ లోషన్ ఉపయోగించాలి. పుచ్చకాయ, ద్రాక్ష, కర్భూజ వంటి పండ్ల రసాలు తాగడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. మజ్జిగ, కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వేసవిలో ఆహారం త్వరగా పాడవుతుంది. కాబట్టి తాజా ఆహారం మాత్రమే తీసుకోవాలి. కళ్లను తరచుగా చల్లటి నీటితో కడుక్కోవాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు కళ్లజోడు ధరించాలని వైద్యులు చెబుతున్నారు.చర్మాన్ని ఎండ నుంచి రక్షించుకోవడానికి చల్లటి నీటితో స్నానం చేయాలి. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో తిరగడం తగ్గించాలి. నీరు ఎక్కువగా తాగాలి. ఫ్రిజ్ లోని నీరు తాగడం వల్ల గొంతు నొప్పి వస్తుంది. కావున మట్టి కుండలోని నీటిని తాగడం మంచిది. వేసవిలో చెమట ఎక్కువగా పడుతుంది కాబట్టి రోజూ స్నానం చేయడం మంచిదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.




## రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**

రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూర్యపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో వాహన చోదకులకు రాంగ్ రూట్ ట్రాఫిక్ నిబంధనలు పలు వాటిపై ఎస్సై ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ.. వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున రాంగ్ రూట్ ప్రయాణలు అసలు చేయవద్దని వాహన చోదకులకు సూచించారు.నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.గత పది రోజుల్లో రాంగ్ ప్రయాణం చేసిన 150 మంది వాహన చోదకులకు జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు.

# పైన పటారం.. లోన లొటారం..!

■ వరంగల్ ట్రాఫిక్ పోలీస్ వెహికల్ డొల్ల..

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

"కుయ్.. కుయ్.. కుయ్.. కుయ్.." అంటూ రహదారులపై జెట్ స్పీడ్‌తో వెళ్లే పోలీస్ వాహనాలు కొన్ని డొల్లగా మారినా పై అధికారులు పట్టించు కోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వెహికల్స్ కండిషన్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిన కనీస రిపేర్ చేయించేందుకు మొగ్గు చూపడం లేదని అంటున్నారు. ఈ తరహాలోనే వరంగల్ ట్రాఫిక్ పోలీసు వాహనం మారిందని.. 'పైన పటారం లోన లొటారం' అన్నట్టుగా సదరు వెహికల్ కనిపిస్తోంది. నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించే సదరు ప్రభుత్వ వాహనం పూర్తిగా డొల్లగా మారింది. దానిని చూస్తేనే.. అసలు ఎప్పుడు ఏది ఊడి కింద పడిపోతుందో? అనే విధంగా కనిపిస్తుండటం విడ్డూరం. అయినా సదరు వాహనంలో ఆందోళనతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. వెహికల్ బాడీ మొత్తం తుప్పు పట్టి ఇరువైపులా అద్దాలు లేకపోవడం.. ఇండికేటర్ కూడా పనిచేయకపోవడం గమనార్హం. వెహికల్ కండిషన్‌ను చూసిన పలువురు.. రాత్రి వేళలో కనీసంగా వెహికల్ మెయిన్ హెడ్ లైట్ అయినా పని చేస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది అసలు వాహనానికి కాలపరిమితి చెల్లిపోయిందని ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌నకు ఇవ్వాలని రవాణా శాఖ నిబంధనను ఎందుకు పోలీస్ శాఖ పట్టించుకోవడం లేదని ఇంకొందరు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు స్పందించి నిత్యం ప్రజల కోసం శ్రమించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎలాంటి హాని జరగకముందే ఆ వాహనాన్ని రిపేర్ చేయించాలని కోరుతున్నారు. లేదా సదరు వెహికల్‌కు కాలం చెల్లినట్లయితే దానిని స్క్రాప్‌నకు ఇచ్చేసి.. కొత్త వెహికల్‌ను అందించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





## శ్రీరాములపల్లిలో సన్నబియ్యం పంపిణీ

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల సురేష్ ఆధ్వర్యంలో రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబం కడుపునిండా భోజనం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ లీడర్లు పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుత్తికొండ రవికుమార్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గైకోడి రాజు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ గొడుగు శైలజ కాంగ్రెస్ నాయకులు మేకల రామస్వామి, ఎల్లయ్య, సంజీవ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌గా ఎంపికైన రామకృష్ణ కళాశాల విద్యార్థి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



మెట్ పల్లి పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాలలో బీకాం పూర్తి చేసుకున్న మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల శ్రీపాల్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నివీర్ ఫలితాలలో అగ్నివీరుగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీ పాల్ ను కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ గాడి పెల్లి హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ అధ్యాపక బృందం అభినందించారు.



## రోడ్డు ప్రమాదల నివారణకు చర్యలు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వేములపల్లి ఎస్సై డి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం బుగ్గ బావి గూడెం, శెట్టిపాలెం,వేములపల్లిలో రోడ్డు భద్రత కమిటీతో బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. బ్లాక్ స్పాట్ ఏరియాలను గుర్తించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిపి ఉండడం వలన ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు వెంట ఉన్న గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనదారులు ప్రజలు ప్రమాదాలను బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలన్నారు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## ప్రశాంతంగా పది పరీక్షలు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు పరీక్ష కేంద్రాలలో 252 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాలలో ముందస్తుగా ఏ విధమైన మాల్ ప్రాక్టీస్ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. మండలంలో 2 పరీక్ష కేంద్రాలలో పది పరీక్షలు ముగియడంతో ఉరుకులు పరుగులతో వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద స్థానిక ఎస్సై డి వెంకటేశ్వర్లు పోలీస్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పరిశీలించారు. ఈనెల 7 నుంచి పది పరీక్షల మూల్యాంకనం మొదలుకానుంది. ఇప్పటికే పది పరీక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

## గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటిన విలాయాత్ అలీ

మొదటి పేజీ తరువాయి

చేయాలనే తపనతో పోటీ పరీక్షలకు సిద్ధమై మొదటి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. అంతటితో ఆగకుండా గ్రూప్-1 రాసి ఉద్యోగిని సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు డిప్యూటీ కలెక్టర్ వచ్చే అవకాశం ఉందని విలాయత్ తెలిపారు. తల్లితండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో రానిచ్చినట్లు పేర్కొన్నారు. కాగా బుధవారం పలువురు ఎండీ.విలాయాత్ అలీని తన మిత్రుడు అమీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు..!

■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, డెస్క్:**



బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందని 2021 జనాభా లెక్కలను వాయిదా వేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. జనగణనతో పాటు కులగణన చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారని, జన, కులగణన నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయాల్సి వస్తుందని బీజేపీ జనగణన వాయిదా వేస్తోందని, దేశంలో తొలిసారి తెలంగాణలో బలహీ నవర్గాల లెక్క 56.36 శాతంగా తేల్చామని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జం తర్ మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలను బీసీ సంఘాలు ధర్నాకు ఆహ్వానించాయి. ఈ నిరసనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జనాభా తెలియకుంటే రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయని, స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలని కోరారు. రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకువచ్చామని, రిజర్వేషన్ల అంశానికి శాశ్వత పరిష్కారం లభించాలని రాహుల్‌గాంధీ చెప్పారని అన్నారు. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని, దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నదని, అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారని అన్నారు. బలహీనవర్గాల లెక్క తేల్చాలని మొరార్జీ దేశాయ్ మండలి కమిషన్ ఏర్పాటు చేశారని, 52 శాతం బలహీనవర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని మండలి కమిషన్ చెప్పిందని తెలిపారు. బీజేపీ కుట్ర చేసి మండలి కమిషన్‌కు వ్యతిరేకంగా కమండల్ యాత్ర చేపట్టిందని, అసైన్డ్ చట్టం ద్వారా భూస్వాముల స్థలాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిందని, బీసీలను బలపర్చాలనే ఆలోచనకు బీజేపీ వ్యతిరేకమని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదని, దేశ రాజకీయాలకు దిక్సూచిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వ పాలన, రాష్ట్ర అభివృద్ధిలో బలహీనవర్గాలు భాగస్వాములు కావాలని అన్నారు. రిజర్వేషన్లు పెంచడం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, అన్ని పార్టీలను సమన్వయం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం చేశామని అన్నారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరట్లేదని, తెలంగాణలో బలహీవర్గాలకు రిజర్వేషన్లు ఇస్తే మోదీకి కష్టమేంటని ప్రశ్నించారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకుంటామని తీర్మానం పంపితే స్పందించలేదని, ప్రధాని తమ ఆలోచనలు పంచుకుంటే గౌరవం ఉంటుందని అన్నారు.

# ప్రమాదకరంగా 'కాకతీయ'బ్రిడ్జీలు!

మొదటి పేజీ తరువాయి

ఈ కాకతీయ కెనాల్ ఇరుకైన బ్రిడ్జిల గుండానే వెళ్తుంది. కాగా, ఈ కాలువల గుండా ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిందని కొందరు వాహనదారులు వెల్లడిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం పొంచి ఉంటుందని చెబుతున్నారు. కనీసంగా సైడ్ వాల్స్ కూడా లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని, రాత్రివేళల్లో అయితే ఇక జర్నీ వెరీ డేంజరస్‌గా మారుతోందని వాపోతున్నారు. గతంలో రూ.1,100 కోట్లతో కాకతీయ కెనాల్ పూర్తిస్థాయి నీటిమట్టంతో కరీంనగర్ నుంచి సూర్యాపేట వరకు తీసుకువెళ్లడానికి లైనింగ్ పనులు, రిపేర్ వర్క్స్ చేపట్టారని కానీ, ప్రమాదకర స్థితిలో ఉన్న ఇరుకైన కాకతీయ కెనాల్ బ్రిడ్జిల స్థానంలో కొత్తవి మాత్రం నిర్మించలేదని పలువురు పేర్కొంటున్నారు.

### సైడ్ వాల్స్ సంగతి మరిచారు..

నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై హన్మకొండ-చింతగట్టు వద్ద, అనంతసాగర్ వద్ద, కేసీ క్యాంపు వద్ద అటు బోర్నపల్లి వద్ద కాకతీయ కెనాల్ బ్రిడ్జిలకు కనీసం సైడ్ వాళ్లు కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇరుకైన బ్రిడ్జిల మీదుగా నిత్యం పెద్దపెద్ద వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

ఈ ఇరుకైన బ్రిడ్జిల వద్ద అనేక వెహికల్స్.. నీటి ప్రవాహం ఉన్న సమయంలో కాలువలో పడిన ఘటనలు నాలుగేండ్ల నుంచి జరుగుతున్నాయి. అయినా కనీస రక్షణ చర్యలు తీసుకోవడానికి ఆఫీసర్లు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండటంతో పాటు బ్రిడ్జి కెపాసిటీ అంటే అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడం వల్ల బ్రిడ్జిలపై రెండు పెద్ద వాహనాలు పట్టని పరిస్థితి నెలకొంది. చింతగట్టు వద్ద శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిపై నిత్యం రద్దీ ఉండి అనేక యాక్సిడెంట్లు జరిగి కాలువలో వెహికల్స్ పడిపోతున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

### రక్షణ జాలీలూ లేవు

అనంతసాగర్ వద్ద కాకతీయ కాలువలో ఇటీవల ఇసుక లారీ బోల్తా పడింది. కేసీ క్యాంపు వద్ద కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వ బ్రిడ్జిల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో పాటు ఒకవేళ ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో పడితే రక్షించుకోవడానికి రక్షణ జాలీలు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఎల్కతుర్తి నుంచి చింతగట్టు వరకు నిత్యం వేలాది వాహనాలు రద్దీతో ప్రయాణిస్తుంటాయి. ఆ రద్దీకి ప్రస్తుత కాలువ వంతెనలు ఏ మాత్రం సరిపోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరంగల్-కరీంనగర్ నేషనల్ హైవే పనులు జరుగుతున్నప్పటికీ.. బైపాస్‌లు వచ్చిన చోట మళ్లీ పాత రోడ్డు గుండా.. ఇదే పాత వంతెనలపై వాహనాలు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిల స్థానంలో కొత్త వంతెనలు, రక్షణ చర్యలు చేపట్టి వెంటనే సైడ్ కాలువలు ప్రయారిటీ బేసిస్‌లో నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## మంత్రి ఇంటిని ముట్టడించిన కేయూ విద్యార్థి సంఘాలు

**వేద న్యూస్, హన్మకొండ :**




హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు జరిపిన లాటి చార్జీలు నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు బుధవారం హనుమకొండ లోని రాంనగర్ లో గల మంత్రి కొండా సురేఖ ఇల్లును ముట్టడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులకు విద్యార్థి సంఘ నాయకులకు తీవ్ర వాగ్వాదం తోపులాట జరగటంతో విద్యార్థులను పోలీసులు బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి సుబేదారి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెచ్.సి.యు. విద్యార్థుల పట్ల కర్కశంగా, అత్యంత పాశవీకంగా వ్యవహరిస్తూ, అక్రమ లాఠీ చార్జీలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై లాఠీ ఛార్జి కి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. హెచ్.సి.యు. భూములను కార్పొరేట్, పెట్టుబడిదారులకు అప్పగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హెచ్సీయూలో చెట్లను నరికి వేస్తూ పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను విరమించుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూములను, విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని తెగ నమ్మాలని చూడటం కంచే చేను మేసిన చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, భవిష్యత్ విద్యార్థుల ప్రయోజనాలకు, యూనివర్సిటీలో పరిశోధనల అభివృద్ధికి, నాణ్యమైన ప్రయోగశాలల నిర్మాణానికి ఉపయోగపడే భూములను వేలం వేసే పద్ధతులను విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## సొమ్ము కేంద్ర ప్రభుత్వానిది... సోకు రాష్ట్ర ప్రభుత్వానిది..!

**వేద న్యూస్, కమలాపూర్ :**

రేషన్ డీలర్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో పెట్టాలని భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ బియ్యానికి సంబంధించిన సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే దానిని తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, సొమ్ము కేంద్ర ప్రభుత్వానిది, సోకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదా ? అని ఎద్దేవ చేశారు. నిబంధనల ప్రకారం రేషన్ బియ్యం సబ్సిడీ అందజేస్తున్నది కేంద్ర ప్రభుత్వం కాబట్టి తప్పనిసరిగా రేషన్ డీలర్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన వాగ్దానాలను మరచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుందని, కేంద్ర ప్రభుత్వం అందించే సాయం కూడా తామే అందిస్తున్నట్లు ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేసే ప్రయత్నం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. రేషన్ బియ్యం సబ్సిడీ అందించేది కేంద్ర ప్రభుత్వం అని ప్రజలందరికీ తెలుసునని, తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని గొప్పలకు పోయినా ప్రజలను నమ్మే పరిస్థితి లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలే నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పేరిట ప్రజల దృష్టిని మరల్చేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తుందని దుయ్యబట్టారు. ఈ వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కట్కూరి అశోక్ రెడ్డి, తుమ్మ శోభన్ బాబు, తోట సురేష్, ఇనుగాల రత్నాకర్, భూపతి ప్రవీణ్, చెలికే శ్రీనివాస్, బండారి సుధాకర్, చెరిపెల్లి రతన్, రాజేందర్, పాక కుమార్, అద్భుతరావు, రాజు, స్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పథకాన్ని ప్రారంభించిన షాకీర్

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని పలు రేషన్ షాప్ లలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ షాకిర్ సిద్దికి ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఉద్దేశ్యం, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చేయడమే అన్నారు. ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రతి పేద కుటుంబం ఆకలికి గురికాకుండా, పోషకాహారాన్ని సమృద్ధిగా అందుకునేలా ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్, గుజ్జేటి చక్రధర్, ఇందిరమ్మ సభ్యురాలు శాంత, అనిత తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, W arangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, W arangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073